క్లుప్తంగా

నేడు వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ

ఓర్వకల్లు : మండలంలోని వైఎస్సార్ చేయూత లబ్ధిదారులకు ఆదివారం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేతుల మీదుగా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీఎం వెంకటరామిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక పొదుపు భవనం ప్రాంగణంలో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే కార్యక్రమానికి చేయూత లబ్ధిదారులతో పాటు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నేడు వైఎస్సార్ చేయూత వారోత్సవాలు

కల్లూరు: స్థానిక మండల పరిషత్ ఆవరణలో ఆదివారం వైఎస్సార్ చేయూత వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఏపీఎం శ్రీనివాస్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

కోడుమూరులో..

కోడుమూరు రూరల్: వైఎస్సార్ చేయూత 4వ విడత కార్యక్రమంలో భాగంగా ఆదివారం కోడుమూరులోని శ్రీవాసవీ కల్యాణ మండపంలో లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్నట్లు ఏపీఎం పుష్పావతి శనివారం తెలిపారు. కార్యక్రమానికి కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, ఎంపీపీ గాడి రూతమ్మ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ హాజరు కానున్నట్లు తెలిపారు.

నేడు ఎడ్ల బండలాగుడు పోటీలు

గూడూరు రూరల్: మండల పరిధిలోని చనుగొండ్లలో నాగలింగేశ్వరస్వామి జాతరను పురస్కరించుకుని గ్రామ ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు శనివారం గ్రామ పెద్దలు తెలిపారు. విజేతల ఎడ్ల యజమానులకు మొదటి బహుమతి రూ.10,016 దాత విజయప్రతాప్‌రెడ్డి, రెండవ బహుమతి రూ.7,516 దాత టీచర్ తిరుమల్‌రెడ్డి, మూడవ బహుమతి రూ.5,016 దాత అశోక్‌కుమార్, నాలుగవ బహుమతి రూ. 3,016 దాత పోలీసు మధుమోహన్ చేతుల మీదుగా అందించనున్నామన్నారు.

నేడు అంబేడ్కర్ గురుకుల ప్రవేశ పరీక్ష

సి.బెళగల్: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్ ప్రవేశానికి ఆదివారం పరీక్ష నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బలరాముడు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఐదో తరగతి ప్రవేశానికి ఉదయం 9 గంటలకు, ఇంటర్ ప్రవేశానికి మధ్యాహ్నం 2 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందన్నారు. హాల్ టికెట్‌తో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్‌పీతో గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఆయన సూచించారు.

గడ్డివామి దగ్ధం

కల్లూరు: మండల పరిధిలోని దొడ్డిపాడు గ్రామంలో శనివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చిన్న మిన్నేల్ల కళ్లంలో వేరుశనగ పొట్టు, జొన్న సొప్ప, వరి గడ్డితో గడ్డివామి వేశాడు. ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని వామి పూర్తిగా కాలిపోయింది. విషయం తెలిసిన వెంటనే కర్నూలు అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

జగనన్న కాలనీలో గ్రావెల్ తవ్వకం



జగనన్న కాలనీలో ఎర్రమట్టి తవ్విన దృశ్యం

కల్లూరు: మండల పరిధిలోని తడకనపల్లె గ్రామంలో 86వ సర్వే నెంబర్‌లో రెండు రోజుల క్రితం గుర్తుతెలియని దుండగులు ఎర్రమట్టి తవ్వారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద కర్నూలు నగరానికి చెందిన ప్రజలకు ఇక్కడ ఇళ్ల స్థలాలకు కేటాయించారు. జగనన్న కాలనీ పేరుతో లేఅవుట్ వేశారు. అయితే రెండు రోజుల క్రితం గుర్తుతెలియ దుండగులు ఎర్రమట్టి తవ్వారు. ఈ విషయంపై కల్లూరు తహసీల్దార్ మునివేలును వివరణ కోరగా పరిశీలించి విచారణ చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వేలం పాటలు

కర్నూలు సిటీ: ఏపీఎస్ఆర్టీసీ కర్నూలు బస్ స్టేషన్‌లోని కార్గో లాజిస్టిక్స్ కౌంటర్‌లో క్లెయిమ్ చేయని వస్తువులను సోమవారం ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నారు. ఈ వేలం పాటలో ఆసక్తి ఉన్న వారు పాల్గొనవచ్చని జిల్లా ప్రజారవాణా అధికారులు తెలిపారు.

జంబో షెడ్డు ప్రారంభం

కర్నూలు (అగ్రికల్చర్): వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.6 కోట్లతో చేపట్టిన జంబో షెడ్డును ఈనెల 11న పాణ్యం ఎమ్మెల్యే, మార్కెట్ కమిటీ గౌరవ చైర్మన్ కాటసాని రాంభూపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించనున్నారని మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందు తెలిపారు.

నేత్ర పర్వం..బుగ్గరామేశ్వరుడి కల్యాణం



ఉత్సవమూర్తులకు కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో శనివారం తెల్లవారు జామున బుగ్గరామేశ్వరుడి కల్యాణం నేత్ర పర్వంగా జరిగింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వాముల వారికి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. ముందుగా ఆలయ గర్భగుడిలో నూతన పట్టు వస్త్రాలతో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ముస్తాబుచేశారు. అక్కడి నుంచి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కల్యాణ కట్ట వరకు పల్లకీలో ఆశీనులు చేసి, బాజా భజంత్రీలతో తీసుకెళ్లారు. కల్యాణ కట్టపై అధిష్టించిన స్వామి, అమ్మవార్లకు వేద పండితులు వేదమంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. స్వాముల వారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దాదాపు గంటసేపు జరిగిన కల్యాణ తంతును వీక్షించిన భక్తులు తన్మయత్వం చెందారు. ఉత్సవ కమిటీ చైర్మన్ రామకృష్ణ దంపతులు కల్యాణ పెద్దలుగా వ్యవహరించారు.

అలరించిన సనీ సంగీత విభావరి

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి నిర్వహించిన సినీ సంగీత విభావరిని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన విజయ ఈవెంట్స్ అండ్ క్రియేషన్స్ బృందం ప్రదర్శించిన సంగీత విభావరి ప్రేక్షకులను అలరించాయి. అనంతరం కొద్ది సేపు ప్రేక్షకుల మధ్య కూర్చొని కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, ఉత్సవ కమిటీ చైర్మన్ రామకృష్ణ, నాయకులు జీకే వెంగన్న, గోపా రమణారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా, గోపా రామోహన్‌రెడ్డి, కాల్వ చిన్న వెంకటేశ్వర్లు, గంధం వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచు చిన్న అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

కమనీయం..భోగేశ్వరుని కల్యాణం

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల ఎర్రమల కొండలలో వెలసిన శ్రీ దుర్గాభోగేశ్వరుని కల్యాణం శనివారం తెల్లవారుజామున వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపించారు. స్వామివారికి ఆలయచైర్మన్ సునీల్‌కుమార్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలను సమర్పించారు. పురోహితుల మంత్రోచ్ఛరణ మధ్య పార్వతీ పరమేశ్వరుల కల్యాణం కమనీయంగా సాగింది. అనంతరం భక్తులకు స్వామి తీర్థప్రసాదాలను ఆలయప్రధానార్చకులు శ్యాంసుందర్‌శర్మ అందించారు. కల్యాణ వేడుకల్లో ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ధర్మకర్తలు పరమేశ్వరరెడ్డి, శివుడు, సురేంద్రనాథరెడ్డి, కుమారి పాల్గొన్నారు.

వర్కూరులో వైభవంగా శివపార్వతుల కల్యాణం..

కోడుమూరు రూరల్: మండలంలోని వర్కూరులో వెలసిన సిద్ధేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా శనివారం గ్రామస్తులు శివపార్వతుల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అంతకుముందు గ్రామస్తులు సంప్రదాయబద్ధంగా పుట్టమన్ను, తోరణాలు తెచ్చి పెండ్లి పందిరి వేసి స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం కల్యాణ మూర్తులను గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు.



హాజరైన ప్రేక్షకులు



కాల్వబుగ్గలో గీతాలు ఆలపిస్తున్న గాయకులు



కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, తదితరులు



గట్టు మల్లికార్జున, భ్రమరాంబాదేవి అమ్మవార్లకు కల్యాణం నిర్వహిస్తున్న పురోహితుడు

సి.బెళగల్‌లో..

సి.బెళగల్: మండల కేంద్రం పరిధిలోని కొండపై వెలసిన ఆదిదంపతులు గట్టు మల్లికార్జున స్వామి, భ్రమరాంబ దేవి అమ్మవార్ల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను నిర్వాహకులు శేఖరయ్య వ్యవసాయ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన కల్యాణ మండపానికి చేర్చారు. పురోహితులు నరసింహాచారులు శాస్త్రోంగా స్వామి వారి కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా స్వామి వారి సేవకుల నందికోలు సేవ ఆకట్టుకుంది. సాయంత్రం గ్రామంలో ఉత్సవ దేవతా మూర్తులను ఊరేగించారు. అలాగే మిట్ట సోమప్ప, అన్నప్ప స్వామి ఆలయాల్లోనూ నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలకల్, కొండాపురం, గుండ్రేవుల, ఇనగండ్ల, బురాన్‌దొడ్డి, మారందొడ్డి, కె.సింగవరం, ముడుమాల, సంగాల, కంబదహాల్ తదితర గ్రామాలలో శివరాత్రి ఉత్సవాలు ముగిశాయి.



వర్కూరులో స్వామిఅమ్మవార్ల ఉత్సవ విగ్రహాలు





కల్లూరులో మాణిక్యాంబ భీమేశ్వర స్వామి కల్యాణమహోత్సవం ,పాణ్యంలో కల్యాణమనంతరం పాణికేశ్వరస్వామి ఉత్సవమూర్తులు

భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు

కల్లూరు: మహాశివరాత్రి వేడుకలు కల్లూరులో వెలసిన శ్రీ ఈశ్వర వీరభద్ర, భీమేశ్వర స్వామి దేవాలయంలో భక్తిశ్రద్ధలతో జరిగాయి. తెల్లవారుజామున శ్రీ ఈశ్వర వీరభద్ర స్వామి భీమేశ్వర స్వామి దేవాలయంలో మన్యాస పూర్వక రుద్రాభిషేకం, మధ్యాహ్నం భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. సాయంత్రం చిన్నారుల భర తనాట్యం, కోలాటాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. తెల్లవారుజామున శ్రీ మాణిక్యాంబ భీమేశ్వర స్వామి వార్ల కళ్యాణ మహోత్సవం అశేష భక్తులనడుమ అత్యంత వైభవంగా జరిగింది. సాయంత్రం పల్లకీ ఉత్సవాలు జరిగాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ నరసింహులు, శ్రీనివాసులు, ఆలయ చైర్మన్ వీరేంద్రకుమార్, వీరశైవలింగాత్ సమితి అధ్యక్షులు చంద్రశేఖరప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు రంగప్ప, జగదీష్, ఈశ్వరప్ప, చిన్న శంకరప్ప పాల్గొన్నారు.

కనులపండువగా పాణికేశ్వరుడి కల్యాణం

పాణ్యం: మండల కేంద్రంలోని పాణికేశ్వర స్వామి ఆలయంలో ఈఓ సువర్ణ ఆధ్వర్యంలో పాణికేశ్వరస్వామి, పార్వతిదేవిల కల్యాణాని కనుల పండువగా నిర్వహించారు. స్వామివార్లకు నెరవాడ గ్రామానికి చెందిన శిరిగిరి ప్రసాద్‌రెడ్డి వివాహ వస్త్రాలు అందించారు. కల్యాణాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

- మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఈఓ రామకృష్ణ ఆధ్వర్యంలో నాగలింగేశ్వరస్వామి వార్ల కల్యాణం వైభవంగా జరిగింది. నాగలింగేశ్వరస్వామి, పార్వతిదేవిల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు.

రమణీయం.. నాగ, రామలింగేశ్వరస్వామి రథోత్సవం



చనుగొండ్లలో రథానికి పూజలు చేస్తున్న దృశ్యం



గుడిపాడులో రథాన్ని లాగుతున్న భక్తులు

గూడూరు రూరల్: మండల పరిధిలోని గుడిపాడు రామలింగేశ్వర స్వామి, చనుగొండ్లలో నాగలింగేశ్వరస్వామి రథోత్సవాన్ని శనివారం కడు రమణీయంగా నిర్వహించారు. ఉదయం నుంచి నాగలింగేశ్వర, రామలింగేశ్వరస్వామికి భక్తులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. గుడిపాడులోని రామలింగేశ్వరస్వామికి చంద్రారెడ్డి, మల్లికార్జునరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డిలు రథానికి పూజలు జరిపి కొబ్బరికాయలను కొట్టారు. అనంతరం ఓం నమశ్శివాయ అంటూ భక్తులు రథాన్ని ముందుకు లాగారు. చనుగొండ్లలోని నాగలింగేశ్వరస్వామి రథానికి సర్పంచు వెంకటేశ్వరమ్మ, వెంకటేశ్వరరెడ్డి, తిరుమల్‌రెడ్డి, సీఐ శ్యామరావు తదితరులు పూజలు నిర్వహించి కదిలించారు. రథోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి బండలాగు పోటీలు



రాష్ట్రస్థాయి బండలాగుపోటీలను ప్రారంభిస్తున్న మిద్దె శివరాం

గడివేముల: మండలంలోని భోగేశ్వరాలయం పరిధిలో రాష్ట్రస్థాయి నాలుగు పళ్లలోపు బండలాగు పోటీలు శనివారం శాంతిరాం కళాశాలల అధినేత మిద్దె శివరాం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు బాగుంటేనే దేశం బాగుటుందని రైతులందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఏడాది శివరాత్రికి ఎద్దుల పోటీలు నిర్వహించడం శుభపరిణామన్నారు. అంతకుముందు భోగేశ్వరాలయానికి వచ్చిన ఆయనకు చైర్మన్ సునీల్‌కుమార్‌రెడ్డి, ఈఓ చంద్రశేఖరరెడ్డిలు స్వాగతం పలికారు.స్వామి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం మండపంలో స్వామి,అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు.

విజేత బిల్లలాపురం వృషభాలు

ఉదయం నుంచి సాయంత్రం వరకు హోరాహోరీగా సాగిన పోటీల్లో బిల్లలాపురంకు చెందిన భూమా గోవర్ధన్‌రెడ్డి ఎద్దులు మొదటిస్థానంలో నిలిచి రూ.30 వేలను కైవసం చేసుకున్నాయి. నంద్యాల మండలం పోలూరుకు చెందిన రామసుబ్బారెడ్డి వృషభాలు రెండో స్థానంలో రూ.20 వేలు, నందికొట్కూరు మండలం కొణిదేల గ్రామానికి చెందిన దండు రైడర్స్ మూడో బహుమతి రూ.15 వేలు సాధించాయి. ఎడ్ల యజమానులకు ఆలయ చైర్మన్ సునీల్ కుమార్‌రెడ్డి, మాజీ చైర్మన్ రామసుబ్బారెడ్డి, ధర్మకర్త సురేంద్రనాథ్‌రెడ్డి బహుమతులను అందించారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు ఉపయోగించుకోవాలి



చిన్నారికి టీకా వేస్తున్న వైద్యసిబ్బందికి సూచనలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్ కుమార్

కర్నూలు (హాస్పిటల్): గ్రామాల్లోకి వచ్చే ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్ కోరారు. శనివారం ఆయన గార్గేయపురం సచివాలయం పరిధిలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు వచ్చే ఆరోగ్య సమస్యలను నయం చేసేందుకుగాను ప్రజల వద్దకే వైద్యసిబ్బందిని తీసుకుని వెళ్లాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు సత్ఫలితాలిస్తున్నాయన్నారు. వైద్యుల చికిత్సతో పాటు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మందుల పంపిణీ తదితర సేవలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. గర్భిణులకు, చిన్నారులకు తప్పనిసరిగా సమయానుసారంగా టీకాలు వేయించాలని సూచించారు. అనంతరం గర్భిణులకు ఐరన్ ఫోలిక్ సిరప్, ఎత్తు, బరువు తక్కువ ఉన్న పిల్లలకు విటమిన్–ఎ సిరప్‌లు, ఐరన్ ఫోలిక్ మాత్రలు పంపిణీ చేశారు.

దళిత క్రైస్తవులను ఎస్సీలుగా కొనసాగించాలి



మాట్లాడుతున్న జాన్ వెస్లీ

కర్నూలు(సెంట్రల్): దళిత క్రైస్తవులను ఎస్సీలుగా కొనసాగించాలని దళిత సోషన్ ముక్తి మంచ్(డీఎస్ఎంఎం) జాతీయ నాయకులు జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. శనివారం కర్నూలు ఎంపీపీ హాలులో మత స్వేచ్ఛ..మత సామరస్యం అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. దేశంలో ఎవరికి నచ్చిన మతం, కులాన్ని వారు ఎంచుకోవచ్చని, అదే సమయంలో సామాజిక, ఆర్థిక అంశాల ఆధారంగా రిజర్వేషన్లను రాజ్యాంగం హక్కుగా కల్పిస్తోందని చెప్పారు. క్రిష్టియన్‌లుగా మారిన దళితులకు ఎస్సీ రిజర్వేషన్‌ను కొనసాగించాలని, బీసీలుగా గుర్తించడం అన్యాయమని అన్నారు. దళిత క్రిష్టియన్‌లను ఎస్సీలు కొనసాగించాలని ఏపీ ప్రభుత్వం తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపగా మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో మోదీని ఇంటికి పంపకపోతే దళితులను బానిసలుగామార్చే ప్రమాదం ఉందన్నారు. సదస్సులో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, ఎండీ ఆనందబాబు తదితరులు మాట్లాడారు.

11న వైఎస్సార్ చేయూత సంబరాలు

కర్నూలు సిటీ: మండల పరిధిలోని పసుపుల సచివాలయం సమీపంలోని ఫంక్షన్ హాలులో ఈనెల 11న వైఎస్సార్ చేయూత సంబరాలు నిర్వహించనున్నారు. కర్నూలు రూరల్ మండ ల పరిధిలోని 23 గ్రామ పంచాయతీల లబ్ధిదారులతో పాటు వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి హాజరుకానున్నారు.

హామీ ఇచ్చారు..నెరవేర్చారు

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- గడిగరేవుల, కొరటమద్ది గ్రామాల్లో నూతన భవనాలు ప్రారంభం
- అభివృద్ధి పనులు శిలాఫలకాల ఆవిష్కరణ



గడిగరేవుల సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

గడివేముల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని గడిగరేవులలో సచివాలయం, ఆర్బీకే, హెల్త్ సెంటర్లతో పాటు సీసీ రోడ్డు, డ్రైనేజీలను ప్రారంభించారు. అలాగే కొరటమద్ది గ్రామంలో ఆర్బీకే, సచివాలయంతో పాటు పలు అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్ర రాజకీయాల్లోనే విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకుని వాటిని మేనిఫెస్టోలో చేర్చి, అధికారంలోకి రాగానే పరిష్కరించారన్నారు. వంద శాతం హామీలను నెరవేర్చిన ఏకైక సీఎం జగన్ అని చెప్పారు.

ఇంటి వద్దకే వైద్యసేవలు

గత ప్రభుత్వాలు ప్రజల వైద్యం గురించి పట్టించుకోలేదని ఎమ్మెల్యే అన్నారు. చిన్నపాటి రోగం వచ్చినా మండల కేంద్రానికి లేదా పట్టణానికి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్, 104 అంబులెన్స్, జగనన్న ఆరోగ్య సురక్ష, సకల సౌకర్యాలు కలిగిన 108, ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచారన్నారు. గ్రామాల్లోనే మరింత నాణ్యతగా వైద్య సేవలు అందించేందుకు హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు నాటుకునేప్పటి నుంచి పంట దిగుబడులను అమ్ముకునేంత వరకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి,పార్టీ మండల అధ్యక్షుడు శివరామిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ చంద్రశేఖరరెడ్డి, నంద్యాల జిల్లా వ్యవసాయ విభాగం అధ్యక్షుడు శిరుప శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు రామ్మోహన్ రెడ్డి, నాగేశ్వరరెడ్డి, ఎంపీటీసీ సావిత్రి, భోగేశ్వరం చైర్మన్ సునీల్‌కుమార్‌రెడ్డి, ఉప సర్పంచ్ గోదా ప్రసాద్, వైఎస్సార్సీపీ నాయకులు రాఘవయ్య, గోపాలయ్య, రమణ, బాషా, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భోగేశ్వరాలయాన్ని మరింత అభివృద్ధి చేస్తాం

దుర్గా భోగేశ్వరాలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గడిగరేవుల గ్రామం సమీపంలో వెలసిన శ్రీ దుర్గాభోగేశ్వ ఆలయానికి శనివారం విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ చైర్మన్ సునీల్‌కుమార్‌రెడ్డి, ఈఓ చంద్రశేఖరరెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం భోగేశ్వరుడికి, అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన గదులను ప్రారంభించారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు ఉశేన్‌బాషా, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ పుల్లయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, ఎల్లారెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు

సెలవుదినాల్లో గణనీయంగా పన్ను వసూలు

కర్నూలు (టౌన్): సెలవుదినాల్లో పన్ను కౌంటర్లు పని చేయడంతో పన్నుదారులు పన్ను చెల్లించేందుకు క్యూ కడుతున్నారు. రెండవ శనివారం ఇంటి పన్నులు, నీటి పన్నుల బకాయిలు గణనీయంగా చెల్లించారు. ఒక్క రోజు ఇంటి, నీటి పన్నులు రూ.12,82,881 వసూలైనట్లు నగరపాలక మేనేజర్ చిన్నరాముడు, రెవెన్యూ అధికారి జునీద్ తెలిపారు. ఆదివారం కూడా పన్ను కౌంటర్లు పనిచేస్తాయని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నేడు చండీహోమం

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా ఉదయం 9 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు. నవగ్రహ, లక్ష్మీగణపతి, మూల మంత్ర సహిత చండీహోమం, కార్యసిద్ధి ఆంజనేయస్వామికి సింధూరార్చన జరుగుతాయన్నారు.

ప్రజానగర్‌లో హోమియో వైద్యశిబిరం

కర్నూలు (హాస్పిటల్): నగర శివారులోని ప్రజానగర్ కాలనీలో శనివారం లైఫ్ హోమియోపతి ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వడదెబ్బ నివారణకు, వ్యాధి నిరోధక శక్తికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు రాధిక, జాన్ డేవిడ్ మాట్లాడుతూ వడదెబ్బ నివారణకు, థైరాయిడ్, కీళ్ల నొప్పులు, బీపీ, షుగర్‌కు హోమియో మందులు బాగా పనిచేస్తాయన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తా



హ్యాండ్‌బాల్ పోటీలో తలపడుతున్న ఇరు జట్ల క్రీడాకారులు

కర్నూలు (టౌన్): క్రీడాకారులకు తన వంతు ప్రోత్సాహం అందిస్తానని కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి అన్నారు. శనివారం నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ సీనియర్ పురుషుల చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. 9 జిల్లాల నుంచి క్రీడాకారులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆదర్శ విద్యా సంస్థల వ్యవస్థాపకులు తిమ్మయ్య, హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు రామాంజనేయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.